క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మేడికొండూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ జి.నాగరాజు కుమార్ శనివారం తెలిపారు. మండలంలోని మేడికొండూరు, సిరిపురం, పాలడుగు, కొర్రపాడు, జంగంగుంట్లపాలెం, పొట్లపాడు, మందపాడు, సరిపూడి, యలవర్తిపాడు, గుండ్లపాలెం, విశదల గ్రామాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



నగరంపాలెం: జిల్లాలో హోంగార్డు పని చేస్తున్న వై.అక్కేశ్వరరావు గతేడాది డిసెంబర్ 12న అనారోగ్యంతో మృతి చెందారు. జిల్లాలోని హోంగార్డుల ఒక రోజు వేతనం రూ.2.37 లక్షల చెక్కుని అతడి భార్య ప్రమీలకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ తుషార్ డూడీ అందించారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ స్వర్ణలత, ఆర్ఎస్ఐ కృష్ణయ్య, ఏఎస్ఐ చంద్రశేఖర్, హోంగార్డ్ ఎన్సీఓ అధికారులు పాల్గొన్నారు.

థైరాయిడ్ లోపంతో మహిళల్లో పలు సమస్యలు




గుంటూరు మెడికల్: థైరాయిడ్‌లోపంతో మహిళల్లో పలు సమస్యలు తలెత్తుతాయని మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ వి.వి.రామ్ కుమార్ తెలిపారు. వరల్డ్ థైరాయిడ్ డే సందర్భంగా శనివారం స్థానిక కొత్తపేటలోని ఎస్వీఆర్ షుగర్ హాస్పిటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్ కుమార్ మాట్లాడుతూ షుగర్ వ్యాధి ఉన్న పది నుంచి 30 శాతం మందికి థైరాయిడ్ హార్మోను తక్కువ ఉత్పత్తి అవుతుందని తెలిపారు. ఈ సమస్య మహిళల్లో ఎక్కువగా ఉంటుందని, దీనివల్ల షుగర్ కంట్రోల్ కష్టమవుతుందని పేర్కొన్నారు. షుగర్ ఉన్నవారు థైరాయిడ్ పరీక్ష చేయించుకుంటే మంచిదని ఆయన సూచించారు. థైరాయిడ్‌లోపం వల్ల గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు, సంతానలేని, షుగరు కంట్రోల్ కాకపోవడం ఇతర అనర్థాలు తలెత్తుతాయన్నారు. థైరాయిడ్ తగ్గిపోతే నీరసం, అలసట, బద్ధకం డిప్రెషన్, మలబద్ధకం, ఆహారం ఎక్కువ తినకపోయినా బరువు పెరగడం, అల్ప రక్తపోటు, పల్స్ రేటు తగ్గిపోవడం లక్షణాలు ఉంటాయని ఆయన వివరించారు.

శాసనాలలో మన సంస్కృతి నిక్షిప్తం



నగరంపాలెం: శాసనాల అధ్యయనం ద్వారా మన భాష, సంస్కృతి, మూలాలు తెలుస్తాయని లేమల్లెపాడు ఎంటీఎస్ ఉపాధ్యాయుడు మోదుగుల రవికృష్ణ అన్నారు. స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయ ఆవరణలో శనివారం అమరావతి అమరేశ్వరాలయ శాసనాల సంపుటి 'అమరేశ్వరం' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంపుటిలో ఉన్న 38 శాసనాల ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉండే పలు ప్రాంతాలు, వెయ్యేళ్ల కిందట ఉమ్మడి జిల్లా రాజులు, వారి ప్రతినిధులు, ఉద్యోగులు ఇచ్చిన దానాలు మొదలైన విషయాలన్నీ తేటతెల్లంగా తెలుస్తాయని అన్నారు. సభకు అరసం ఏపీ రాష్ట్ర కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అధ్యక్షత వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ కె.ప్రఫుల్లరాణి పుస్తకావిష్కరణ చేయగా, ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ భూసురాపల్లి వెంకటేశ్వర్లు, ఆర్.సాంబశివరావు, కోటేశ్వరప్రసాద్, కందిమళ్ల శివప్రసాద్, కె.శివరెడ్డి, నాగరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.


బాలుడి అదృశ్యం



గుంటూరు ఈస్ట్: బాలుడు కనిపించకుండా పోయిన ఘటనపై నగరపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణబాబు కాలనీకి చెందిన జానపాటి రమేష్ కుమారుడు అరుణ్ (16) శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని బాలుడ్ని గుర్తించిన వారు 8688831336 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఈత.. కారాదు గుండెకోత !

- చిన్నారుల ప్రాణాలమీదకు తెస్తున్న సరదా
- సెలవుల్లో పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం
- ఈతలో శిక్షణ ఇప్పిస్తే మంచిది



కృష్ణానది ప్రకాశం బ్యారేజ్‌పై ఎత్తు ప్రాంతం నుంచి నీటిలోకి దూకుతున్న బాలుడు

తాడేపల్లి రూరల్: చిన్నారుల ఈత సరదా ఒక్కోసారి ప్రమాదాలకు దారి తీస్తుంది. పాఠశాలలకు సెలవులు కావడం, వేసవి ఎండ తాపం నేపథ్యంలో స్నేహితులు, ఇరుగుపొరుగు వారితో కలిసి కాల్వలు, చెరువులు, గుంటలలో ఈతకని, స్నానానికని వెళ్లి పలువురు చిన్నారులు మృత్యువాత పడుతున్న ఘటనలు మనం చూస్తున్నాం. గుంటూరు జిల్లావ్యాప్తంగా ప్రకాశం బ్యారేజ్ నుంచి వివిధ ప్రాంతాలకు సాగు, తాగునీరు కోసం కాలువలు ఉన్నాయి. ఇవేకాకుండా జిల్లావ్యాప్తంగా అనేక చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిల్లో ఈతకని వెళ్లి పలువురు చిన్నారులు ప్రమాదాల బారిన పడుతూ తల్లిదండ్రులకు గుండెకోత మిగిలుస్తున్నారు.

కంట కనిపెట్టాలి

తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారనే విషయాన్ని క్షుణ్ణంగా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వారు బయటకు వెళ్లిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలి. సెలవుల కారణంగా ఇళ్లవద్దే ఉంటున్న చిన్నారులను ఒక కంట కనిపెడుతూ, ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండటం మూలాన వారు ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవచ్చు. ప్రస్తుతం ఎక్కడ చూసినా చిన్నారులు ఈత సరదాతో కాలువలు, నదులు, కుంటలు, చెరువులకు వెళ్తున్నారు. అందులో ఒకరికో ఇద్దరికో ఈత రావడం.. వారి భరోసాతో నీటి లోపలకు వెళ్లడంతో ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. స్నేహితులతో బయటకి పంపిస్తే ఎవరితో వెళుతున్నారు.. ఎక్కడికి వెళుతున్నారో కచ్చితంగా తెలుసుకోవాలి.

నీరు కన్నీరు

వానలు కురుస్తుండడంతో ఇప్పటికే జిల్లావ్యాప్తంగా కాలువలు, చెరువుల్లో నీరు చేరుకుంది. పిల్లలు సెలవు రోజుల్లో ఈతకోసం సరదాగా నీటివద్దకు వెళుతుంటారు. ఈత వచ్చిన వారితో పాటు ఈతరాని వారు కూడా నీటిలోకి దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈత వచ్చినవారు సైతం ఒక్కోసారి పెరిగే నీటి ప్రవాహానికి తట్టుకోలేక కొట్టుకొనిపోవడం, ఊబుల్లో దిగబడడం వంటివి జరుగుతుంటాయి. అందుకే సాధ్యమైనంతగా చెరువులు, కాలువలకు దూరంగా ఉండడం మంచిది. ఈ మధ్య కృష్ణానది ఎగువ, దిగువ ప్రాంతాల్లో చుట్టపు చూపుగా వచ్చిన ఎంతోమంది చిన్నారులు ఈత సరదాతో మృత్యువాత పడిన ఘటనలు చోటు చేసుకున్నాయి.

- గుంటూరు వెంకటరెడ్డిపాలేనికి చెందిన బీటెక్ విద్యార్థి ఇటీవల మహానాడులోని బంధువుల ఇంటికి వచ్చి పిల్లలతో కలసి కృష్ణానదికి వెళ్లి నీటి గుంటలో పడి మృతి చెందాడు.
- విజయవాడ రామలింగేశ్వనగర్‌కు చెందిన విద్యార్థులు పాఠశాలలకు సెలవులు కావడంతో సరదాగా ఈతకు వచ్చారు. అందులో ముగ్గురు మృతిచెందగా ఒక బాలుడు గల్లంతయ్యాడు. ఇప్పటి కూడా ఆచూకీ లభించలేదు.

తల్లిదండ్రులే బాధ్యత వహించాలి



సరదాగా ఈతకు వెళ్లి ముక్కుపచ్చలారని చిన్నారులు ఎంతోమంది నదులు, కాలువల్లో దిగి ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు. పిల్లలకు ఈత అంటే సరదా. సెంటర్లకు పంపి నేర్పించడం చాలా మంచిది. వారి కోర్కెలను మనం గుర్తించకుండా ఉండడం వల్లే చాలామంది ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పకుండా వెళ్లి మృత్యువాత పడుతున్నారు. మంగళగిరి కార్పొరేషన్‌లో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేశారు. అలాంటి కేంద్రాలకు పిల్లలను పంపి నేర్పించాలి.

– రామకృష్ణ, ఈత శిక్షకుడు

అప్రమత్తంగా ఉండాలి..

సెలవుల్లో విద్యార్థులు, ఊర్లకు వెళ్లే కుటుంబాల వారు అన్ని విషయాల్లో తగిన రీతిలో జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా చిన్నారులు నదులు, కాలువలు, బావులలో సరదాగా ఈతకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి.

– కల్యాణ్ రామ్, తాడేపల్లి సీఐ

పచ్చిరొట్ట ఎరువుతో అధిక దిగుబడి

ఫిరంగిపురం: పచ్చిరొట్ట ఎరువుతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖాధికారి వాసంతి తెలిపారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట ఎరువులైన పిల్లి పెసర, జనుము, జీలుగా వంటి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులకు 50శాతం సబ్సిడీపై అందజేస్తున్నట్లు చెప్పారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ ఫొటోస్టాట్ల కాపీలు అందజేసి పొందాలని ఆమె సూచించారు.

మేడికొండూరులో...

మండలంలోని అన్ని గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో 50 శాతం రాయితీపై జనుము, జీలుగ, పిల్లి పెసర, విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.నాగరాజు శనివారం తెలిపారు. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డులతో రైతులు కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించాలని ఆయన సూచించారు. పచ్చిరొట్ట విత్తనాల వల్ల నేలకు భూసారం, నీటి సామర్థ్యంతో పాటు పంట ఉత్పత్తుల్లో నాణ్యత పెరుగుతుందని తెలిపారు.

డబ్ల్యూహెచ్ఓ నిబంధనల ప్రకారమే ఆపరేషన్లు

గుంటూరు మెడికల్: కాటూరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), ఎఫ్ఓజీఎస్ఐ నిబంధనల మేరకే గర్భిణులకు సిజేరియన్లు చేస్తున్నామని డీన్ డాక్టర్ కె.ఎస్.వరప్రసాద్, ప్రసూతి విభాగ అధిపతి డాక్టర్ బి. వెంకటేశ్వరావురావు తెలిపారు. తమ బోధనాసుపత్రికి పేద,మధ్య తరగతి, గ్రామీణ ప్రాంత ప్రజల ఎక్కువగా వస్తున్నట్లు వెల్లడించారు. చాలా క్లిష్టమైన కాన్పులు కోసం, గతంలో సిజేరియన్ చేయించుకున్న వారు వస్తున్నారని పేర్కొన్నారు. ఆపరేషన్లు కూడా ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. ఆసుపత్రి ద్వారా అనేక రకాల పథకాల కింద గర్భిణులు, కాన్పు అయిన మహిళలకు వైద్య సహాయం ఉచితంగా అందిస్తున్నామని ఆయన వెల్లడించారు.

ఘనంగా ఓకల్ ఆండ్రు జన్మదిన వేడుకలు

మంగళగిరి: పట్టణంలోని వీటీజేఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో గత ఆరు రోజులుగా మంగళకరం పేరుతో కృత్రిమ చేతుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ది హ్యాండ్ ప్రాజెక్టు నిర్వాహకుడు కీస్‌గల్లి ఆధ్వర్యంలో నిపుణుల బృందం బాధితులకు జేఎంకే-1 కృత్రిమ చేతులు అమరుస్తున్నారు. శనివారం కిస్‌గల్లి బృందం సభ్యుడు, ఉగాండా దేశానికి చెందిన ఓకల్ ఆండ్రు వలంటీర్లు, దివ్యాంగుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వలంటీర్లు, మంగళకరం బృంద సభ్యులు ఆండ్రుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అనిల్ చక్రవర్తి, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఓకల్ ఆండ్రుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న వలంటీర్లు, దివ్యాంగులు తదితరులు

ఘనంగా సాయిశ్రుతి అకాడమీ వార్షికోత్సవం

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ పద్మావతి కళావేదికపై శనివారం సాయంత్రం సాయిశ్రుతి మ్యూజిక్ అకాడమీ 37వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. వ్యవస్థాపకులు ప్రేమ్‌కుమార్ శిష్య బృందం వోకల్, వీణా, వేణువు, మాండోలిన్, తబల, డోలక్, కీబోర్డు, హార్మోనియం, వయోలిన్, గిటార్, డ్రమ్స్ తదితర వాయిద్యాలతో ప్రతిభను చాటారు. కార్యక్రమానికి ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేయగా, వల్లూరి కృష్ణకిశోర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



హిందీ పరీక్షకు 34 మంది గైర్హాజరు

రేపల్లె రూరల్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలలో భాగంగా మండలంలోని పేటేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో శనివారం రెండో రోజు హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. రేపల్లె పట్టణ, మండలం నుంచి 40 మంది విద్యార్థులకు గానూ ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. 34 మంది గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్ బాబూజీ తెలిపారు.

వైభవంగా వీరాంజనేయుని పల్లకీ ఉత్సవం



జంపని(వేమూరు): మండలంలోని జంపనిలో గల శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం సువర్చలా సహిత వీరాంజనేయస్వామి పల్లకీ ఉత్సవాన్ని శనివారం నిర్వహించారు. వేద పారాయణ నడమ భక్తుల హరే రామ నామ సంకీర్తన మధ్య ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. అర్చకులు శ్రీనివాసమూర్తి ఆలయ పల్లకీ ఉత్సవ విశిష్టతను భక్తులకు వివరించారు. మూల విరాట్ స్వరూప వీరాంజనేయ స్వామికి సహస్ర అష్టోత్తర శత నామాలతో జాజి పూలతో అర్చన జరిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తొలిసారిగా వీఏ ఎక్మో చికిత్స



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

యువకుడి ప్రాణాలు కాపాడిన రమేష్ హాస్పిటల్

గుంటూరు మెడికల్: ఏపీలో మొట్టమొదటిసారిగా వీఏ ఎక్మో చికిత్స ద్వారా హార్ట్ ఎటాక్‌కు గురైన యువ ఇంజనీర్‌ను కాపాడినట్లు గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పటల్ వైద్య బృందం వెల్లడించింది. శనివారం గుంటూరులోని హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రామారావు వివరాలు వెల్లడించారు. ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న 35 సంవత్సరాల యువకుడికి రెండు వారాల కిందట మంగళగిరిలోని గుడికి వెళ్లినప్పుడు ఛాతిలో నొప్పి వచ్చిందన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ దగ్గరికి వెళ్లగా ఆయన కొన్ని పరీక్షలు చేసి తీవ్రమైన గుండెపోటుగా నిర్ధారించి ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ కు రిఫర్ చేసినట్లు వెల్లడించారు. ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేసి గుండె పంపింగ్ తగ్గిపోవడం, కార్డియోజెనిక్ షాక్, పల్మనరి ఎడిమా వంటి క్లిష్టమైన పరిస్థితులు ఉన్నట్లు నిర్ధారించామని తెలిపారు. రోగికి వెంటనే వెంటిలేటర్ అమర్చి క్యాథ్ ల్యాబ్‌కు తరలించి యాంజియోగ్రాం పరీక్ష చేయగా గుండెకు రక్తాన్ని అందించే ప్రధాన రక్తనాళం నూరు శాతం రక్తపు గడ్డలతో పూడిపోయి ఉండటాన్ని గమనించామని చెప్పారు. వెంటనే ఎమర్జెన్సీ యాంజియోప్లాస్టీ చికిత్స ద్వారా రక్తపు గడ్డలను తొలగించామని వివరించారు. గుండె అతివేగంగా కొట్టుకోవడం, రక్తపోటు తగ్గిపోవడం, మూత్రం కొద్దిగా మాత్రమే రావడం, వెంటిలేటర్ మీద కూడా ఆక్సిజన్ లెవెల్స్ సరిపడా లేకపోవడం, గుండె పనితీరు చాలా బలహీనంగా ఉండటం వంటి లక్షణాలు యువకుడిలో కనిపించాయన్నారు. మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ లోనికి వెళ్లడంతో రోగి సహయకులకు పరిస్థితి వివరించి, ఆఖరి ప్రయత్నంగా 'ఎక్మో' అనే లైఫ్ సైవింగ్ మెషీన్ ద్వారా చికిత్స అందించామన్నారు. ఎక్మో మెషీన్ సహాయంతో రోగిని ప్రాణహాని నుంచి కాపాడగలిగామని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటువంటి వైద్య చికిత్స మొదటిసారిగా అస్టర్ రమేష్ హాస్పిటల్స్‌లో నిర్వహించామని సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్. రామారావు తెలిపారు. సడెన్ హార్ట్ ఎటాక్ వల్ల సంభవించే దుష్ఫలితాల్ని అధిగమించడానికి ఎక్మో తరహా వైద్య విధానం ఎంతో మేలు చేస్తుందని డాక్టర్ పర్వతనేని నాగశ్రీహరిత వెల్లడించారు. యువకుడి ప్రాణాలు కాపాడిన వైద్య బృందాన్ని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు అభినందించారు.

ఎన్నికల కమిషన్ నిరాకరించడం తగదు



లక్ష్మీపురం: పార్లమెంట్, నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్ల సమాచారాన్ని ఎన్నికల కమిషన్ నిరాకరించడం సరైంది కాదని అవగాహన సంస్థ సభ్యులు విమర్శించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం 'ఎన్నికల కమిషన్ – విశ్వసనీయత ' అంశంపై సమావేశం నిర్వహించారు. ఏపీ లీగల్ ఫోరం కన్వీనర్ అవధానుల హరి మాట్లాడుతూ ప్రజాస్వామ్య ప్రక్రియలో అతికీలకమైన పోలింగ్ సమాచారాన్ని వెల్లడించడంలో ఎన్నికల కమిషన్ మీనమేషాలు లెక్కించడం దేశ ప్రతిష్టకు భంగకరమని తెలిపారు. మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి మాట్లాడుతూ ఓటింగ్ వివరాలు వెల్లడిపై ఈసీని ఆదేశించలేమని సర్వోన్నత న్యాయస్థానం ప్రకటించడం ప్రజాస్వామ్యశక్తులకు తీవ్ర నిరాశ కలిగించిందని చెప్పారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ రామారావు, సింగరయ్య, సదాశివరావు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఏజెంట్ల వివరాలివ్వాలి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి గంగరాజు



తాడికొండ: నెలాఖరులోగా అన్ని రాజకీయ పార్టీల నేతలు కౌంటింగ్ ఏజెంట్ల వివరాలివ్వాలని తాడికొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.గంగరాజు సూచించారు. శనివారం తన కార్యాలయంలో నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు.నెలాఖరులోగా కౌంటింగ్ ఏజెంట్ల వివరాలు, ఫొటోలతో పాటు సంబంధిత అర్హత పత్రాలు తమకు అందజేయాలని తెలిపారు. ఈవీఎంల కౌంటింగ్ కోసం 14 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా అంతే సంఖ్యలో ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ కోసం నాలుగు టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నామని, దీనికి నలుగురు ఏజెంట్లు, ఇద్దరు అదనపు ఏజెంట్లు, ఈటీపీఎస్ కోసం ఒక ఏజెంట్ ఏర్పాటు చేసుకోవచ్చని సూచించారు. 31న కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణ ఉంటుందని, అంతా తప్పక హాజరయ్యేలా చూడాలని ఆయన కోరారు. అనంతరం కౌంటింగ్ హాలును పరిశీలించేందుకు పార్టీల ప్రతినిధుల్ని నాగార్జున యూనివర్సిటీకి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తాడికొండ, ఫిరంగిపురం తహసీల్దార్లులు ఈ. మధుసూదనరావు, జి. రాఘవేంద్రరావు డెప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్, ఎన్నికల డీటీ మోహినీకుమారి, ఏఎస్ఓలు శివ, లలిత, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీజీ టీకా సురక్షితం



శిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ యానీ గ్రేస్

ఫిరంగిపురం: బీసీజీ టీకాతో దుష్ఫలితాలు ఉండవని డాక్టర్ యానీగ్రేస్ తెలిపారు. మండలంలోని మేరికపూడి వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో శనివారం నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. 98మందికి షుగర్, బీపీ, థైరాయిడ్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు బీసీజీ టీకాలు వేయించుకోవడంవల్ల కలిగే ప్రయోజనాల గురించి డాక్టర్ యానీగ్రేస్ వివరించారు. 18ఏళ్ల నిండి బరువు తక్కువ ఉన్నవారు, 60ఏళ్ల పైబడినవారు, షుగర్ ఉన్నవారు, పొగతాగేవారు కూడా బీసీజీ టీకా వేయించుకోవడం ద్వారా మున్ముందు క్షయవ్యాధి రాదని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్యసిబ్బంది కె.సుదర్శన్‌రాజు, గంగరాజు, పాపులమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైన్ షాపులో రూ. 1.50లక్షల చోరీ

మంగళగిరి: పట్టణంలోని జాతీయ రహదారి వెంటగల ప్రభుత్వ వైన్ షాపులో నగదు చోరీ జరిగిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పట్టణ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... కొప్పురావూరుకాలనీ జాతీయ రహదారి వెంటగల ప్రభుత్వ వైన్‌షాపులో సిబ్బంది శుక్రవారం రాత్రి వరకు విక్రయించగా వచ్చిన రూ. 1.50లక్షలను కౌంటర్‌లో ఉంచి తాళాలు వేసి వెళ్లారు. శనివారం మరలా తెరిచేందుకు రాగా షట్టర్ల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. కౌంటర్‌లోని నగదు కూడా మాయమైంది. దీంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో షాపు సూపర్‌వైజర్ నక్కా గోపి ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్లపై నిఘా

మండలంలో అల్లర్లు జరగకుండా రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఉత్సవాలు నిర్వహించరాదని సూచించారు. ఊరేగింపులు, బాణసంచా కాల్చినా, కవ్వింపు చర్యలు చేపట్టినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లకు ప్రతిరోజూ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

తక్కువ వడ్డీకే గృహ, వాహన రుణాలు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ జవహర్

కొరిటెపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అతి తక్కువ వడ్డీ రేటుతో గృహ, వాహన రుణాలు అందిస్తోందని బ్యాంకు గుంటూరు రీజనల్ హెడ్ ఎస్.జవహర్ తెలిపారు. స్థానిక నగరంపాలెంలోని ప్రాంతీయ కార్యాలయంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'రిటైల్ ఎక్స్‌పో-2024' శనివారం జరిగింది. ఈ సందర్భంగా బ్యాంకు రీజనల్ హెడ్ జవహర్ మాట్లాడుతూ ఖాతాదారుల సౌకర్యార్థం యూనియన్ బ్యాంకు సేవలను మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు. రూ.40 లక్షల వరకు కొల్లేటరల్ లేని విద్యా రుణాలు అందిస్తోందన్నారు. అనంతరం పలువురికి గృహ, వాహన, విద్యా రుణాల మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో క్రెడాయ్ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి, బ్యాంక్ డిప్యూటీ రీజనల్ హెడ్ అశ్వర్థ నాయక్, రిటైల్ లోన్ పాయింట్ హెడ్ రామాంజనేయ కుమార్, పలువురు బ్రాంచి మేనేజర్లు, నగరంలోని బిల్డర్లు, కారు డీలర్లు, ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీలు పాల్గొన్నారు.



ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న క్రెడాయ్ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి, యూబీఐ రీజనల్ హెడ్ జవహర్

విధి నిర్వహణలో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ లలిత కుమారి

భట్టిప్రోలు: వైద్య ఆరోగ్య సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి అన్నారు. శనివారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీడీవో జేబీవీ మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ సిబ్బంది రాత్రి పూట విధించే డ్యూటీలలో తప్పని సరిగా ఉండాలని పేర్కొన్నారు. వైద్యశాలలకు వచ్చే రోగులతో ఆప్యాయతతో మెలిగి చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. అప్పుడే ప్రభుత్వ వైద్యశాలల పట్ల ప్రజలకు నమ్మకం కలుగుతుందని తెలిపారు. వైద్యులు కూడా వచ్చామా.. సంతకం పెట్టామా.. వెళ్లామా అన్న రీతిలో కాకుండా తీసుకుంటున్న జీతానికి సార్థకత చేకూరేలా పని చేయాలని ఆమె సూచించారు. మండలంలో చేపట్టిన నాడు-నేడు పనులను వెంటనే పూర్తి చేయాలని విద్యాశాఖాధికారుల్ని కోరారు. మండలంలో సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ మల్లోలు ఉషారాణి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్ రోజు ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు

పట్నంబజారు: కౌంటింగ్ రోజు ఘర్షణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని లాలాపేట స్టేషన్ సీఐ పి.దేవప్రభాకర్ చెప్పారు. సంగడిగుంట, లాలాపేట, చౌత్రా సెంటర్ తదితర ప్రాంతాల్లో ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. సీఐ దేవప్రభాకర్ మాట్లాడుతూ గెలుపు ఎవరిదైనా అంతా సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. ర్యాలీలు, ఊరేగింపులు నిషిద్ధమని తెలిపారు. అవాంఛనీయ ఘటనలు, వివాదాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ దేవప్రభాకర్